
సాక్షి
బాపట్ల
సోమవారం । 23 । డిసెంబర్ । 2024



శ్రీరామ కోటి మహోత్సవం

నగరంపాలెం: సంపత్‌నగర్ శ్రీశృంగేరి పీఠపాలిత శ్రీరామనామక్షేత్రంలో నిర్వహిస్తోన్న 98వ శ్రీరామ కోటి మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. మూలవిరాట్లకు అలంకరణ చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 576.90 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 8,144 క్యూసెక్కులు వదిలారు.

వేంకట నారసింహ అలంకరణ



సత్తెనపల్లి: ధనుర్మాసం సందర్భంగా స్థానిక అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి గుడిలో ఆదివారం స్వామికి వేంకట నారసింహావతారం అలంకరణ చేశారు.

న్యూస్‌రీల్

ప్రజలతో పోలీసులు ఫ్రెండ్లీగా ఉండాలి



కొల్లిపర: స్టేషన్‌కు వచ్చే ప్రజలతో పోలీసులు ఫ్రెండ్లీగా ఉంటూ సమస్యలు తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ అన్నారు. ఆదివారం కొల్లిపర స్టేషన్‌ను తెనాలి డీఎస్పీ జనార్దనరావు, ఎస్‌బీ సీఐ రాంబాబులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. రిసెప్షన్ సిబ్బంది పనితీరు, రికార్డులు, కేసుల పరిష్కారం, స్టేషన్ స్థితిగతులు తదితరాలను పరిశీలించారు. ఎస్ఐ పి.కోటేశ్వరరావును అడిగి వివరాలు తెలుసుకున్నారు. సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విలేకరులతో ఎస్పీ మాట్లాడుతూ.. నేరాల కట్టడి కోసం స్టేషన్ అధికారులు నిరంతరం శ్రమించాలన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, సచివాలయం మహిళా పోలీసులు పాల్గొన్నారు.

3 నుంచి జీఎన్‌ఎం వార్షిక పరీక్షలు

గుంటూరు మెడికల్: జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ (జీఎన్ఎం) వార్షిక పరీక్షలు వచ్చే ఏడాది జనవరి 3 నుంచి 11వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ మేరకు గుంటూరు జీజీహెచ్ ప్రభుత్వ నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపల్ కోటా సుజాత ఆదివారం తెలిపారు. ఉదయం 9 - మధ్యాహ్నం 12 గంటల వరకు గుంటూరు వైద్య కళాశాలలో పరీక్షలు ఉంటాయని చెప్పారు. జిల్లావ్యాప్తంగా 36 నర్సింగ్ స్కూల్స్ నుంచి 1,500 మంది హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల చీఫ్ ఎగ్జామినర్‌గా గుంటూరు జీజీహెచ్ సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్‌కుమార్ వ్యవహరిస్తారని వెల్లడించారు.

పంటల బీమా ప్రీమియం గడువు పొడిగింపు

కొరిటెపాడు(గుంటూరు): రబీ పంటలకు సంబంధించి రైతులు తమ వాటా ప్రీమియం కట్టడానికి ఈ నెల చివరి వరకు గడువు పొగించినట్లు గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి గడువు ఈ నెల 15వ తేదీతో ముగిసిందన్నారు. రైతుల వినతుల మేరకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు పొడిగించారని పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు 35 శాతం మంది రైతులే ప్రీమియం చెల్లించారన్నారు. మిగతావారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ, ఉద్యాన శాఖలకు చెందిన గ్రామ, మండల, డివిజన్ స్థాయి అధికారులు కూడా రైతులు ప్రీమియం కట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పప్పుశనగకు హెక్టారుకు రూ.125, జొన్నకు రూ.140, మొక్కజొన్నకు రూ.119, పెసరకు రూ.285, మినుముకు రూ.113 చొప్పున ప్రీమియం చెల్లించాలన్నారు. రైతు సేవా కేంద్రాల అసిస్టెంట్లు, మీ సేవా, కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీ), ఇన్సూరెన్స్ పోర్టల్‌లో ప్రీమియం కట్టి బీమా పథకంలో చేరాలని రైతులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రస్థాయి ఖోఖో విజేత ఉమ్మడి ప్రకాశం



జే.పంగులూరు: రాష్ట్రస్థాయి ఖోఖో విజేతగా ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు నిలిచింది. తిరుపతి జిల్లా పుత్తూరులో ఈ నెల 20,21,22 తేదీల్లో అండర్-19 బాలుర స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించారు. ఇందులో ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రథమ స్థానం సాధించింది. ఫైనల్లో ప్రకాశం జిల్లా ఖోఖో బాలుర జట్టు చిత్తూరు జిల్లాతో తలపడింది. రెండు విన్నింగులు కలిసి 10 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. ఈ సందర్భంగా పీడీ సీతారామిరెడ్డి మాట్లాడుతూ అండర్-19 ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు గత 24 ఏళ్ల నుంచి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధిస్తున్నట్లు తెలిపారు. ఈఏడాది ప్రథమ స్థానం సాధించినందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ప్రథమ స్థానం సాధించిన బాలుర జట్టుకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కప్, పతకాలు అందించారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 1902 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 98, తూర్పు కెనాల్‌కు 65, నిజాంపట్నం కాలువకు 72, కొమ్మమూరు కాలువకు 1376 క్యూసెక్కులు విడుదల చేశారు.

అప్పుచేసి పప్పుకూడు

- అంగన్‌వాడీలపై ధరల పిడుగు
- భారీగా పెరిగిన కూరగాయల ధరలు
- పాత చార్జీలతో మెనూ అమలు
- ప్రభుత్వం ఇచ్చే నగదు కంటే సొంత డబ్బులతోనే ఖర్చు
- మెనూ చార్జీలను పెంచాలంటూ డిమాండ్

అంగన్‌వాడీలకు కూరగాయాలు

కూటమి ప్రభుత్వంలో రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర ధరలతో అంగన్‌వాడీ కేంద్రాలు సతమతమవుతున్నాయి. మెనూ అమలు చేయలేక అంగన్‌వాడీలు అవస్థలు పడుతున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచకపోవడంతో అప్పులు చేస్తున్నారు.మెనూ చార్జీలు పెంచాలని పలుమార్లు విన్నవించినా స్పందన కరువవుతోంది. ప్రభుత్వం ఇచ్చే నగదు కంటే సొంత డబ్బులే అధికంగా ఖర్చు అవుతున్నాయని అంగన్‌వాడీలు వాపోతున్నారు.

చీరాల: ధరలు పెరిగినా మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం అందించాలని ప్రభుత్వం చెబుతుండటంతో అంగన్‌వాడీల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జిల్లాలో తొమ్మిది ఐసీడీఎస్ ప్రాజెక్టులలో 1888 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో చిన్నారులు 27,462 మంది ఉన్నారు. కేంద్రాల్లో వీరికి ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందించాల్సి ఉంది. ప్రభుత్వం బియ్యం, నూనె, కందిపప్పు, గుడ్లు, పాలు మాత్రమే అందిస్తోంది. అదీ కూడా ఒక్కో చిన్నారికి రోజుకు 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల పప్పు, 5 గ్రాముల నూనె మాత్రమే ఇస్తోంది. చిన్నారుల సంఖ్యను బట్టి ఆయా సరుకులు పంపిణీ చేస్తారు. ప్రతినెలా కందిపప్పు, బియ్యం రేషన్ దుకాణాల ద్వారా తెచ్చుకోవాల్సి ఉంటుంది. కూరగాయలకు రూ.800, గ్యాస్ సిలిండర్‌కు రూ.400 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది.

కేంద్రాలపై పెను భారం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొద్ది నెలలుగా కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోయాయి. దీంతో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ అమలు చేయడం కష్టంగా మారింది. కూరగాయలు కొనుగోలు అంగన్‌వాడీలకు తలకు మించిన భారంగా మారింది. ప్రభుత్వం ప్రతి నెలా ఇస్తున్న రూ.800 సరిపోవడం లేదు. ఫలితంగా అప్పులు చేసి మరీ చిన్నారులకు పౌష్టికాహారం అందించాల్సిన దుస్థితి నెలకొంది. వాపోతున్నారు. పప్పు, పులిహోర వంటి వాటిల్లో పోపు దినుసులను సైతం కొనుగోలు చేయాల్సి వస్తోంది. వీటికి ప్రభుత్వం అదనంగా ఏమీ ఇవ్వడం లేదు. వంట గ్యాస్ నిమిత్తం ప్రభుత్వం ప్రతి నెలా కేంద్రాలకు ఇవ్వాల్సిన రూ.400 కూడా చెల్లించడం లేదు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు వచ్చే అంగన్‌వాడీ కేంద్రాలు పరిశుభ్రంగా ఉంచాలి. సబ్బులు, చీపుర్లు, చాపలు తదితర సామగ్రి కొనుగోలుకు ప్రభుత్వం నగదు అందించక పోవడంతో అంగన్‌వాడీలకు చేతి చమురు వదులుతోంది. పెరుగుతున్న గ్యాస్, కూరగాయలు, నిత్యావసర ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచకపోడంతో అంగన్‌వాడీలు ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి కేంద్రాల్ని నడుపుతున్నారు.



మెనూ చార్జీలు పెంచాలని కోరుతూ పీడీకి వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో రోజువారీ మెనూ..	
సోమవారం	దోసకాయ పప్పు
మంగళవారం	పులిహోర, టమాటా పప్పు
బుధవారం	ఆకుకూర పప్పు
గురువారం	కూరగాయలతో సాంబారు
శుక్రవారం	కూరగాయల పప్పు
శనివారం	వెజిటబుల్ రైస్, ఆకుకూర, సాంబారు

జిల్లాలో తొమ్మిది ఐసీడీఎస్ ప్రాజెక్టులలో 1888 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి.

ఉన్నతాధికారులకు నివేదించాం

పెరిగిన ధరలకు అనుగుణంగా కూరగాయలు, ఇతర అవసరాలకు తమకు అందిస్తున్న నగదును పెంచాలనే విషయాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు గతంలోనే మా దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదికలు అందించాం.

– ఉమ, ఐసీడీఎస్ పీడీ

సత్ప్రవర్తనతో జీవితం బంగారుమయం



రిమాండ్ ఖైదీలకు సూచనలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

రేపల్లె రూరల్: సత్ప్రవర్తనతో జీవితం, భవిష్యత్ బంగారుమయంగా ఉంటుందని గుంటూరు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి. పార్థసారథి చెప్పారు. పట్టణంలోని సబ్‌జైల్‌లో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రిమాండ్ ఖైదీలకు ఆదివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. క్షణికావేశంలో చేసిన తప్పులు జీవితాలతో పాటు కుటుంబ సభ్యుల పైనా ప్రభావం చూపుతాయని తెలిపారు. దీంతో జీవితకాలం బాధలు పడాల్సిన పరిస్థితులు వస్తాయని చెప్పారు. పగలు, ప్రతీకారాలు, రాగద్వేషాలను వీడి శాంతికాముకులుగా జీవించాలని సూచించారు. అనంతరం జైలులో ఖైదీలకు అందుతున్న వసతులు, మెడికల్ సదుపాయాలు, న్యాయ సహాయాలపై ఆయన ఆరా తీశారు. వివిధ రకాల చట్టాలను వివరించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ లీలావతి, రేపల్లె సబ్‌కోర్టు సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రూపశ్రీ , ప్యానల్ న్యాయవాది కె.వాణి, సబ్ జైలు సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వర్లు, న్యాయవాదులు కె.శ్రీవాణి, కుమార్ పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ ఏర్పాటుతో నేరాల నియంత్రణ

సౌత్ కోస్టల్ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

చీరాల / కారంచేడు : కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేయడం వల్ల నేరాల్ని నియంత్రించవచ్చని సౌత్ కోస్టల్ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తెలిపారు. ఆయన ఆదివారం చీరాల వన్‌టౌన్, కారంచేడు పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేశారు. ట్రాఫిక్ సమస్యలు, శాంతిభద్రతల పరిరక్షణ, పెండింగ్ కేసులు త్వరితగతిన ఛేదన, ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తం చేయడంపై పోలీసు అధికారులతో చర్చించి, పలు సూచనలు చేశారు. ప్రజలందరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, డిజిటల్ అరెస్టులపై జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. వాట్సప్ ద్వారా కస్టమ్స్, సీఐడీ, విజిలెన్స్ ఇతర ప్రభుత్వ శాఖల అధికారులమని బెదిరింపులు వచ్చినప్పుడు మనోధైర్యం కోల్పోకుండా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఆయన సూచించారు. సైబర్ మోసం వల్ల డబ్బులు కోల్పోతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి వివరాలు అందించాలని తెలిపారు. పోలీసు అధికారులు కూడా సైబర్ నేరాల గురించి ప్రజలలో మరింత చైతన్యం కలిగించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ నేర నియంత్రణ కోసం కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేయడం వలన మెరుగైన సేవలను ప్రజలకు అందించవచ్చని తెలిపారు. త్వరలోనే చీరాల వన్‌టౌన్, రూరల్, సముద్రతీర ప్రాంతాలలో విస్తృతంగా సీసీ కెమెరాలు, మైకులను ఏర్పాటు చేసి వాటిని కమాండ్‌కు అనుసంధానం చేసి పర్యవేక్షించనున్నట్లు వివరించారు. అనుమానాస్పద పరిస్థితులు ఉంటే మైక్ ద్వారా స్థానిక వీధుల్లో సిబ్బందిని, ప్రజలను అప్రమత్తం చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. త్వరలోనే కార్యాచరణకు ముందడుగులు వేస్తామని చెప్పారు. కార్యక్రమంలో చీరాల డీఎస్పీ మోయిన్, వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు పాల్గొన్నారు.



జిల్లా ఎస్పీతో మాట్లాడుతున్న ఐజీ

ఆశలను చిదిమేసిన ఆర్టీసీ బస్సు

- పండుగకు షాపింగ్ చేసి బాపట్ల వెళ్తుండగా ఘటన
- ఆర్టీసీ బస్సు ఢీకొని బాలుడి మృతి
- క్రిస్మస్ వేడుకలు జరుపుకోకుండానే ఆనందం ఆవిరి

చీరాల: క్రిస్మస్ పండుగ చేసుకోకముందే ఆ కుటుంబంలో ఆనందం ఆవిరైంది. మృత్యువు కంటి దీపాన్ని ఆర్పేసింది. కళ్ల ముందే కుమారుడు చనిపోవడంతో ఆ దంపతులు పుట్టెడు దుఃఖంలో మునిగిపోయారు. ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకుందామనుకున్న ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. గుండెలవిసేలా రోదించారు. పండుగ సందర్భంగా నూతన వస్త్రాలు కొనుగోలు చేసేందుకు ఆ కుటుంబం బాపట్ల నుంచి చీరాల వచ్చింది. షాపింగ్ పూర్తి చేసుకుని వెళ్తుండగా బస్సు రూపంలో మృత్యువు కబళించింది. ప్రమాదంలో కుమారుడు మృతి చెందగా తల్లిదండ్రులకు గాయాలయ్యాయి. ఈ హృదయ విదారక ఘటన ఆదివారం సాయంత్రం చీరాల రైల్వే ఓవర్ బ్రిడ్జిపై చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. బాపట్లలోని ఆనందపేటకు చెందిన ప్రవీణ్‌కుమార్ భార్య దివ్య కుమారుడు రాహుల్ (9), కుమార్తె జెస్సీతో కలిసి క్రిస్మస్ పండుగ సందర్భంగా నూతన వస్త్రాలు కొనుగోలు చేసేందుకు చీరాల వచ్చారు. పని పూర్తయిన తర్వాత తిరిగి బాపట్ల వెళ్తుండగా చీరాల రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈఘటనలో రాహుల్ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదంలో దంపతులు ప్రవీణ్‌కుమార్, దివ్యలకు తీవ్రగాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న చీరాల వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని డ్రైవర్ సహా బస్సును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



ప్రమాదంలో జరిగిన స్థలం



రాహుల్ (ఫైల్)

దాచేపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం

దాచేపల్లి : దాచేపల్లిలోని అద్దంకి-నార్కెట్‌పల్లి హైవేపై ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గొర్రెల మందపైకి ట్రావెల్ బస్సు దూసుకెళ్లింది. ముగ్గురు గొర్రెల కాపరులు గాయపడ్డారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. రూ.36 లక్షలకుపైగా విలువ చేసే 182 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. మరో 50 గొర్రెలు గాయ పడ్డాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం .. తెలంగాణలోని నారాయణపేట జిల్లా కొంపల్లికి చెందిన లేయప్ప, కర్రెప్ప, ఆవుల మల్లేష్‌లు గొర్రెల కాపరులు. వీరికి 450 గొర్రెలు ఉన్నాయి. స్వగ్రామం నుంచి గొర్రెలను తోలుకుని దాచేపల్లి మండలం మాదినపాడుకి వస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో గొర్రెల మంద దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నారాయణపురంలో అద్దంకి-నార్కెట్‌పల్లి హైవే ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదకు చేరుకుంది. హైదరాబాద్ నుంచి ఇంకొల్లుకు ప్రయాణికులతో బయలుదేరిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు అతివేగంగా వచ్చి గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. ఘటనలో లేయప్ప, కర్రెప్ప గాయపడగా, మల్లేష్ తీవ్రంగా గాయపడ్డాడు. అతని పరిస్థితి విషమంగా ఉంది. 182 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. మరో 50 గొర్రెలకుపైగా గాయపడ్డాయి. గొర్రెల మృతదేహాలు చెల్లాచెదురుగా పడడంతో రహదారి రక్తసిక్తంగా మారింది. తీవ్రంగా గాయపడిన కాపరి మల్లేష్‌ను గురజాల ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట ప్రభుత్వ హాస్పిటల్‌కి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉంది.



ఘటన స్థలంలో గొర్రెల మృతదేహాలు

బాధితులకు న్యాయం చేయాలని ఆందోళన

ఈ ఘటనలో బాధితులకు న్యాయం చేయాలని స్థానికులు ఆందోళన చేశారు. రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం, ట్రావెల్ బస్సు యాజమాన్యం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. గామాలపాడు సర్పంచ్ జంగా సురేష్, వైఎస్సార్ సీపీ నేత ఉల్లేరు హనుమంతరావు, కౌన్సిలర్ షేక్ షరీఫ్‌తో పాటుగా స్థానికులు రాస్తారోకోలో పాల్గొన్నారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఘటన స్థలాన్ని పరిశీలించారు. గొర్రెల కాపరులతో మాట్లాడి నష్టం వివరాలు తెలుసుకున్నారు. రాస్తారోకో చేస్తున్న ఆందోళనకారులతో మాట్లాడారు. బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు.

దేవుడి సన్నిధి.. విశ్వాసుల పెన్నిధి

- క్రిస్మస్ పండుగకు సిద్ధమైన చర్చిలు
- 109 సంవత్సరాలు దాటిన సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చి
- 90 ఏళ్లు పూర్తి చేసుకున్న సెయింట్ లూక్స్ లూథరన్ చర్చి
- 70 ఏళ్లవుతున్న పునీత ఆంథోనీస్ (ఆర్సీఎం) చర్చి

చీరాల రూరల్: తీర ప్రాంతంలో ముఖ్య పట్టణమైన చీరాల అనగానే వాడరేవు, చేనేతలు, మత్స్యకారులు, సినిమా షూటింగ్ ప్రాంతాలు మనకు గుర్తొస్తాయి. కానీ ఇక్కడి పురాతన చర్చిలు కూడా అంతే ప్రసిద్ధం. ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నాయి. ఘన చరిత్ర ఉంది. వందేళ్ల కిందటి చర్చిలు, వందేళ్లకు దగ్గరగా మరికొన్ని ఉన్నాయి. పురాతన చర్చిలను నేటి తరం కూడా అపురూపంగా చూసుకుంటున్నారు. మరమ్మతులు వెంటనే చేపట్టి నిత్యనూతనంగా ఉంచుతున్నారు.

1916లో సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చి నిర్మాణం

స్థానిక చర్చి కాంపౌండ్‌లో ఎంతో సువిశాలమైన ప్రదేశంలో మిషనరీలు 1916లో సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చిని నిర్మించారు. మొదట్లో కొద్దిమంది సభ్యులతో ప్రారంభమైన ఈ చర్చి ప్రస్తుతం వందల సంఖ్యలో విశ్వాసులు వచ్చి ఆరాధనలో పాల్గొంటున్నారు. చర్చిని ఏర్పాటు చేసిన అప్పటి మిషనరీలు పిల్లలు చదువుకునేందుకు బోర్డింగ్ స్కూలు, వైద్య కోసం కింగ్ సింగర్ ఆస్పత్రిని నిర్మించారు. ఆధ్యాత్మికానికే గాక ప్రజలకు విద్య, వైద్యం అందించడంలో వెనుకడుగు వేయలేదు. ఎంతో ఘన చరిత్ర ఉన్న ఈ చర్చి 2016లోనే వందేళ్లు పూర్తిచేసుకుంది. ఇప్పటికీ ఈ చర్చి మరమ్మతులకు గురికాలేదు అంటే ఆశ్చర్యపడక తప్పదు. వందేళ్లు పూర్తి చేసుకోవడంతో ప్రస్తుతం సెయింట్ మార్క్స్ 'సెంటినరీ' లూథరన్ చర్చి పేరుతో ఉదహరిస్తున్నారు. కాలక్రమంలో విశ్వాసులు అధికంగా వస్తుండడంతో లోపల బాల్కనీ కూడా నిర్మించారు. వెనుక ప్రదేశంలో కోట్లాది రూపాయలు వెచ్చించి నూతన చర్చిని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణం స్లాబు దశకు చేరుకుంది. చైర్మన్‌గా దేటా అశోక్ కుమార్ కొనసాగుతున్నారు.

1955లో రోమన్ కాథలిక్ చర్చి (పునీత ఆంథోని) నిర్మాణం

పట్టణ పరిధిలోని మరియమ్మపేటలో రెండెకరాల విస్తీర్ణంలో 1955కు ముందు ఆర్సీఎం చర్చి గుంటూరు రీజియన్‌లో ఉండేది. 1955లో రైట్ రెవరెండ్ బిషప్ ఫాదర్ జేవియర్ చర్చి నిర్మాణాన్ని ప్రారంభించి పూర్తి చేయించారు. అప్పటి నుంచి ఆరాధనలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. విశ్వాసులు అధిక సంఖ్యలో వస్తుండడంతో కొత్త చర్చి నిర్మాణం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీని పరిధిలో పట్టణంలోని అరిటాకుల పేట, వాకావారిపాలెం, ఐక్యనగర్, వేటపాలెం, కారంచేడు, పర్చూరు చర్చీలు కూడా చీరాల చర్చి కిందనే కొనసాగుతున్నాయి. దీన్ని తల్లి సంఘంగా విశ్వాసులు పిలుచుకుంటారు. ప్రస్తుతం ఈ చర్చికి ఫాదర్ జగన్ పాస్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటి వరకు 23 మంది ఫాదర్లుగా విధులు నిర్వర్తించారు. అప్పట్లో విద్య, వైద్యం కోసం చర్చి ఆవరణలోనే స్కూలు, ఆస్పత్రి నిర్మాణం చేశారు. ఇవి అనేక ఏళ్లుగా సేవలందించాయి. ప్రస్తుతం సెయింట్ ఆన్స్ స్కూలు చీరాల పట్టణంలో అతి పెద్దదిగా కొనసాగుతుండడం గమనార్హం.

అనేక చర్చీలకు నిలయం

పేరు ప్రఖ్యాతులు గాంచిన ఈ చర్చిలతో పాటు పేరాలలోని సెయింట్ మార్క్స్, జాన్‌పేటలోని సెయింట్ జాన్స్ ప్యారిష్ , ఉజిలిపేటలోని సెయింట్ పీటర్స్, శాంతి నగర్‌లోని లూథరన్, ఉజిలిపేటలోని క్రిస్టియన్ అసెంబ్లీ ప్రేయర్, బ్రదరన్, మన్నా చర్చీలను దశాబ్దాల కిందట నిర్మించారు. కుందేరు ఒడ్డున బెరాకా, హోసన్నా మినిస్ట్రీస్, బైబిల్ మిషన్ చర్చిలు కూడా సేవలు అందిస్తున్నాయి. వీటితో పాటు చీరాల పట్టణంలో 200 పైగా చర్చీలు ఉన్నాయి.



చర్చి కాంపౌండ్‌లోని సెంటినరీ లూథరన్ చర్చి



మరియమ్మపేటలోని రోమన్ క్యాథలిక్ మిషన్ చర్చి

25 వసంతాలు పూర్తి చేసుకున్న సెయింట్ మాథ్యూస్ చర్చి

కొత్తపేటలోని ఐఎల్‌టీడీ కాలనీలోని సెయింట్ మాథ్యూస్ చర్చి 25 వసంతాలు పూర్తి చేసుకుంది. నవంబర్ 20న రజతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ చర్చికి రెవరెండ్ బి. అనిల్ ప్రభు పాస్టర్‌గా కొనసాగుతున్నారు.

ఆధ్యాత్మికతతో పాటు సామాజిక సేవా లక్ష్యం



ఆరాధన కార్యక్రమాలకు హాజరయ్యే విశ్వాసులను కేవలం చర్చిలకే పరిమితం చేయకుండా ఇతరులపై ప్రేమ, జాలి, దయ, సహృదయం వంటి అంశాలపై బోధిస్తాం. విశ్వాసులకు అవసరమైన మౌలిక సౌకర్యాల కల్పన, విద్య, వైద్యం, సంక్షేమం వంటి అంశాలను పరిగణలోనికి తీసుకుని ఆనాటి పెద్దలు చర్చిలను నిర్మించారు.

–ఫాదర్ జగన్, పునీత ఆంథోని చర్చి

90వ వసంతంలోకి సెయింట్ లూక్స్ చర్చి

సాల్మన్ సెంటర్లోని బేర్ కాంపౌండ్‌లో 1935లో నిర్మించిన సెయింట్ లూక్స్ చర్చి 90వ సంవత్సరంలోకి అడుగిడింది. ఎంతో ప్రాముఖ్యం ఉన్న ఈ చర్చి మొదట్లో ఐదుగురు పెద్దలతో ప్రారంభమైంది. అప్పట్లో బేర్ దొరల సహాయ సహకారలతో ఎంతో సువిశాలమైన ప్రదేశంలో నిర్మాణం చేశారు. అనుబంధంగా విద్యార్థులకు చదువులు చెప్పేందుకు పాఠశాలలు, నర్సింగ్ కళాశాల, పేదలకు వైద్యం అందించేందుకు బేర్ ఆస్పత్రి నిర్మాణం కూడా చేపట్టారు. నాటి నుంచి చర్చిలో ప్రార్థనలతో పాటు ఆస్పత్రిలో వైద్య సేవలు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఈ చర్చి బీ క్లాస్ ప్యారిష్‌గా కొనసాగుతోంది. దేశాయిపేట, జాండ్రపేట, సిపాయిపేట, వేటపాలెం, చినగంజాంలలో నిర్మించిన చర్చీలు కూడా బేర్‌పేటలోని సెయింట లూక్స్ చర్చి కింద పనిచేస్తాయి.



బేర్‌పేటలోని సెయింట్ లూక్స్ లూథరన్ చర్చి

క్లుప్తంగా

జగన్ ఫ్లెక్సీని తగలబెట్టిన దుండగులు



వేమూరు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఫ్లెక్సీలను గుర్తు తెలియని దుండగులు తగలబెట్టిన ఘటన వేమూరు దళితవాడలో జరిగింది.శనివారం ఆయన జన్మదిన వేడుకలు సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు పెట్రోలు చల్లి నిప్పు అంటించడంతో కొంత భాగం కాలిపోయింది. దీనిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు.

ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు

చుండూరు(వేమూరు): యువకుడిని బంధించి కొట్టడంతో పాటు కులం పేరుతో దూషించిన వ్యక్తిపై ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు చుండూరు ఎస్ఐ రెహమాన్ తెలిపారు. చుండూరు మండలంలోని చినపరిమి గ్రామానికి చెందిన పట్లూరి భవానీశంకర్ తెనాలి ఎస్ఆర్ఐ కళాశాలల్లో డ్రిగీ చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన మర్రిరెడ్డి అయ్యప్పరెడ్డి తన తోటలో కొబ్బరికాయలు దొంగతనం చేశాడని అనుమానంతో భవానీశంకర్‌ని కొట్టాడు. దీంతో యానాది కుల పెద్దలు ఎందుకు కొట్టావంటూ అడిగేందుకు అయ్యప్పరెడ్డి ఇంటికి వెళ్లారు. అతడు వాళ్లను కులం పేరుతో దూషించడంతో చుండూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అయ్యప్పరెడ్డిపై ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రెహమాన్ తెలిపారు.

రైలు నుంచిడి జారిపడి వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

చీరాల రూరల్: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం ఉదయం స్టూవర్టుపురం-బాపట్ల రైల్వేస్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య వివరాల మేరకు.. విజయవాడ వైపు వెళ్లే రైలు పట్టాలపై వ్యక్తి మృతి చెంది ఉన్నాడనే సమాచారంతో ఘటనా స్థలాన్ని పరిశీలించగా మృత దేహం వద్ద ఎటువంటి సమాచారం లభించలేదని చెప్పారు. మృతుడి వయస్సు 55 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారిపడి మృతిచెంది ఉంటాడనే అనుమానం వ్యక్తం చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తెరచుకున్న పురాతన రామాలయం

- 100 ఏళ్ల తర్వాత గుడికి మోక్షం
- వేద మంత్రాల నడుమ ద్వార బంధనం తెరచిన భక్తులు
- భద్రాచల రాముని భంగిమలో బయల్పడిన సీతారామ రాతి విగ్రహాలు



భద్రాచల రాముని భంగిమలో ఆలయంలో ఉన్న రాతి విగ్రహాలు

చినగంజాం: భద్రాద్రి రాముడు ఆదేశించిన విధంగానే 100 ఏళ్ల ఆలయానికి మోక్షం లభించింది. ఆదివారం చినగంజాంలోని పురాతన రామాలయం ముఖద్వారం ఎట్టకేలకు వేద మంత్రాల నడుమ తెరుచుకుంది. గ్రామంలో అశుభాలు జరగడంతో పురాతన ఆలయాన్ని కాలగమనంలో మూసివేశారు. గ్రామంలోని భక్తులు సీతారామ స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ద్వార బంధనాన్ని తెరిపించే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం ఆగమ శాస్త్ర పండితులు అగ్నిహోత్రం వెంకట శేషాచార్యులు, ఆయన శిష్యుడు పొన్నపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉదయం విష్వక్సేరాధన, పుణ్యాహవచనం, వాస్తు పూజ, పంచగవ్యారాధన, ప్రోక్షణ, అగ్నిప్రతిష్టాపనం, పూర్ణాహం, కూష్మాండ బలి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గోమాతను ముందుగా ఆలయ ముఖద్వారం వద్దకు తీసుకొని వచ్చి ద్వార బంధనం తెరపించారు.

విగ్రహాలను దర్శించుకున్న భక్తులు

ఆలయ ముఖ ద్వారం తెరచిన వెంటనే ఎన్నో సంవత్సరాల నుంచి బంధించబడి ఉన్న సీతారామస్వామి, లక్ష్మణుడు, దాసాంజనేయస్వామి అద్భుత రాతి విగ్రహాలను భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో కనులారా దర్శించుకున్నారు. ఆలయంలో వాటితోపాటు సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి విగ్రహాలు కూడా ప్రతిష్ఠించి ఉండటాన్ని కనుగొన్నారు. భద్రాచలం సీతారాముల మాదిరిగా ఉన్న రాతి విగ్రహాలను ఆలయం బయటకు తీసుకొని వచ్చి సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి శుద్ధి చేశారు. భక్తులు విశేషంగా విగ్రహాలను దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక భావన్నారాయణ స్వామి ఆలయం ప్రాంగణంలోకి తరలించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వలివేటి వెంకట రామానుజం, మోటుమర్రి రామసుబ్బారావు, తొగరు శ్రీనివాసరావు, వలివేటి మురళీకృష్ణ, వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



రామాలయంలో ప్రతిష్టించి ఉన్న సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాలు

కబడ్డీలో ప్రావీణ్యాన్ని పెంచుకోవాలి



జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో వ్యాయామ ఉపాధ్యాయులు

చెరుకుపల్లి: కబడ్డీలో రాణించేందుకు శారీరక దారుఢ్యంతో పాటు ప్రావీణ్యాన్ని పెంచుకోవాలని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ నాగాంజనేయులురెడ్డి, ఉమ్మడి గుంటూరు జిల్లా జాయింట్ సెక్రటరీ నెల్లిరెడ్డి తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా జూనియర్ బాలుర కబడ్డీ జట్టు ఎంపికను గుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నలుమూలల నుంచి 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనపరచిన 13మందిని ఎంపిక చేశారు, ఇందులో కె.ఎస్.ఎన్. దుర్గాసాయి(బాపట్ల), ఎస్ .వీరప్పయరెడ్డి(ప్యార్లీ) కె.గోపి(బాపట్ల) డి.మనోజ్ కుమార్(రాంబొట్లపాలెం), ఎన్.ధనుష్‌రెడ్డి(పొన్నపల్లి), జె.విజయ్ శివసాయి(చెరుకుపల్లి), పి.కార్తీక్‌రెడ్డి(పొన్నపల్లి) ఎన్.మణికంఠ(చెరుకుపల్లి), జి.విజయ్ భాస్కర్‌రెడ్డి(పొన్నపల్లి) టి.మణికంఠ(చెరుకుపల్లి) ఎన్.ప్రవీణ్‌కుమార్(గుంటూరు), బి.యోగీంద్ర(గుంటూరు) జె.మోహన్‌చంద్(చేబ్రోలు) ఎంపికయ్యారు. వీరంతా జనవరి 3,4,5 తేదీల్లో కర్నూలులో జరగనున్న అంతర్ జిల్లా కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు, కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కందుల వెంకటేశ్వరరావు, అక్కల శ్రీనివాసరెడ్డి, సెలక్షన్ కమిటీ కోచ్ కూరేటి సత్యనారాయణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

కవి కాసలకు సాహిత్య పురస్కారం ప్రదానం



కాసలను సన్మానిస్తున్న శ్రీరామచంద్రమూర్తి దంపతులు, సాహితీవేత్తలు

అద్దంకి: పద్యం, గేయం, వచనంపై మంచి పట్టు కలిగిన కవి కాసన నాగభూషణం అని.. ఆయన సాహిత్యం సంఘ హితమని పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి పేర్కొన్నారు. పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మల విశిష్ట సాహిత్య పురస్కార సభను ఇందిరానగర్‌లోని పుట్టంరాజు కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించారు. ఈసభకు సాహితీ కౌముది అధ్యక్షుడు, ట్రస్టు అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా పుట్టంరాజు మాట్లాడుతూ కాసల నాగభూషణం ఆముక్తమాల్యదకు సరళ వచనానువాదం చేసి ప్రముఖుల ప్రశంసలందుకొన్నారని చెప్పారు. అనేక పత్రికల్లో వీరి కవితలు, కథలు, వ్యాసాలు ప్రచురితమయ్యాయని తెలిపారు. కాసల బహుముఖ ప్రజ్ఞావంతులని పేర్కొన్నారు. పద్యకవి డీవీఎం సత్యనారాయణ మాట్లాడుతూ కాసల వచన రూపం ఇచ్చిన ఆముక్తమాల్యద కావ్యంలోని విశేషాలు నేటితరం ఆకళింపు చేసుకోవడానికి వీలుగా ఉన్నాయని తెలిపారు. ఈ గ్రంథాన్ని కన్నడ భాషలోకి అనువదించడం వలన తెలుగుభాష గొప్పదనం మరింతగా ఇనుమడించిందని తెలిపారు. ఇలపావులూరి శేష శ్రీధరశర్మ మాట్లాడుతూ కాసల రాసిన తిక్కన సీత-తులనాత్మక పరిశీలన అనే గ్రంథం ఆయన రచనా వైవిధ్యాన్ని తెలుపుతుందని పేర్కొన్నారు. వారణాసి రఘురామశర్మ మాట్లాడుతూ కాసల రచించిన నవీన సుమతీశతకం సాహితీ ప్రముఖుల ఆదరణ పొందిందని తెలిపారు. అనంతరం పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మల విశిష్ట సాహిత్య పురస్కారాన్ని పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, శైలజలు కాసలకు అందించారు. కార్యక్రమంలో చప్పిడి వీరయ్య, డాక్టర్ యు.దేవపాలన, గాడేపల్లి దివాకరదత్తు, నారాయణం బాల సుబ్రహ్మణ్యం, గాడేపల్లి దివాకరదత్తు, అద్దంకి నాగేశ్వరరావు, ఓరుగంటి శ్రీనివాసరావు, ఊటుకూరి రామకోటేశ్వరరావు, నిమ్మరాజు నాగేశ్వరరావు, లక్కరాజు శ్రీనివాసరావు, అన్నమనేని వెంకటరావు కంభంపాటి రామమోహనరావు, ఆర్వీ రాఘవరావు, బాలు, మహమ్మద్ రఫీ, అంగలకుర్తి ప్రసాద్, కొండకావూరి కుమార్, కోటయ్య పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికులకు అందని కనీస వేతనాలు

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు

బాపట్ల టౌన్: మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం అవస్థలు పెడుతోందని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు విమర్శించారు. పట్టణంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం మున్సిపల్ కార్మికులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపాల్టీలో కీలకమైన విభాగంలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు అతి తక్కువ వేతనాలు ఇస్తున్నారని తెలిపారు. 2011 వరకు పారిశుద్ధ్య కార్మికులతో పాటు వీరికి వేతనాలు పెరిగాయని, ఇప్పుడు ఇంజినీరింగ్ కార్మికులకు ప్రత్యేకమైన వేతనాలు ఇస్తున్నారని తెలిపారు. వాటర్ వర్క్స్, ఎలక్ట్రిసిటీ, పార్కులు, అండర్ గ్రౌండ్ విభాగాల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు ఐటీఐ, డిగ్రీలు చదువుకొని పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వీరికి అనేకచోట్ల రూ. 12 నుంచి రూ. 15 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. జీవో నంబర్ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని ఆయన కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో అసెంబ్లీ సమావేశాలు జరిగే సమయంలో 'చలో విజయవాడ'కు పిలుపు ఇస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్. మజుందార్, సీఐటీయూ నాయకులు కె. శరత్ ,శామ్యూల్‌తో పాటు జిల్లాలోని బాపట్ల, చీరాల, అద్దంకి ,రేపల్లె మున్సిపాలిటీ ఇంజినీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

పెన్‌పాల్ లెటర్స్‌ను ఆవిష్కరించిన డీఈవో



ఉత్తరాలను ఆవిష్కరిస్తున్న డీఈవో శ్రీరామ్, ఉపాధ్యాయులు హరికృష్ణ, విద్యార్థులు

భట్టిప్రోలు: అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని నంబ్రస్కా రాష్ట్రంలోని నైహార్ట్ మహ నగరంలోని ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులు భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు పంపిన ఉత్తరాలను బాపట్ల విద్యాశాఖాధికారి శ్రీరామ్ పురుషోత్తమ్ ఆదివారం స్వగృహంలో ఆవిష్కరించారు. ఐలవరం హైస్కూల్‌లో ఆంగ్లోపాధ్యాయులుగా పని చేస్తున్న పచ్చారు హరికృష్ణ గత ఏడేళ్లుగా వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వివిధ దేశాలలోని స్కూళ్ల విద్యార్థులకు పెన్‌పాల్ (ఉత్తర ప్రత్యుత్తరాలు) స్కైప్ ద్వారా మాట్లాడటం వంటి కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. నైహార్ట్ స్కూల్ విద్యార్థులతో గత కొంత కాలంగా ఐలవరం హైస్కూల్ విద్యార్థులు ఉత్తర ప్రత్యుత్తరాలు నిర్విఘ్నంగా జరుగుతున్నాయి. శ్రీరామ్ పురుషోత్తమ్ మాట్లాడుతూ వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు హరికృష్ణ పలువురికి ఆదర్శప్రాయుడని తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఉపాధ్యాయులు కూడా ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

రాణించిన ఉత్తరాఖండ్ బ్యాట్స్‌మెన్



ఆదిత్య నౌత్యాల్ (61 పరుగులు)



అనయ నేగి (90 పరుగులు)



సెంచరీ చేసిన మయాంక్ ముద్గ

మంగళగిరి: అమరావతి టౌన్‌షిప్‌లో కల ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో విజయ్ మర్చంట్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆదివారం కర్నాటక, ఉత్తరాఖండ్ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ జట్టు 90 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 288 పరుగులు సాధించింది. టాస్ గెలిచిన కర్నాటక జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేపట్టిన ఉత్తరాఖండ్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. ఉత్తరాఖండ్ బ్యాట్స్‌మెన్ మయాంక్ ముద్గ 104 పరుగులు, అనయ నేగి 90 పరుగులు, ఆదిత్య నౌత్యాల్ 61 పరుగులు సాధించారు. కర్నాటక బౌలర్లు గగన్ సాయి, వెంకటేష్, ప్రీతన్ రాజ్‌లు తలో వికెట్ తీశారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలి



గుంటూరు ఎడ్యుకేషన్: జనవరి 5, 6, 7, 8వ తేదీల్లో కాకినాడలో నిర్వహించనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని సంఘ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎస్ కుసుమకుమారి పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. 5, 6వ తేదీల్లో జరిగే బహిరంగ చర్చల్లో ఉపాధ్యాయులు పాల్గొనవచ్చునని చెప్పారు. 7,8వ తేదీల్లో అతిథులు, ముఖ్యులకే అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం. హనుమంతరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగం – సవాళ్లు అనే అంశంతోపాటు భవిష్యత్తు అవసరాలు – విద్యా విధానాలు తదితర అంశాలపై లోతైన చర్చ ఉంటుందని తెలిపారు. ప్రజా ప్రతినిధులతో పాటు నిపుణులు, మేధావులు పాల్గొంటారని వివరించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు. రాజశేఖర్‌రావు, ఎం. కళాధర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని శాఖల బాధ్యులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు జి. వెంకటేశ్వర్లు, వై. నాగమణి, జిల్లా కోశాధికారి ఎండీ దౌలా, కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, కె. సాంబశివరావు, జి.వెంకటేశ్వరరావు, టి. ఆంజనేయులు, ఎండీ షకీలాబేగం, కె. రంగారావు, బి. ప్రసాద్, కె. కేదార్నాథ్, కె. కామాక్షి, ఆడిట్ కమిటీ ప్రతినిధులు అడవి శ్రీనివాసరావు, ఎం. కోటిరెడ్డి, కె. ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

26న సీపీఐ శత జయంత్యుత్సవాలు

బాపట్ల టౌన్: బాపట్లలో ఈనెల 26న శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సీపీఐ నాయకుడు జె.బి.శ్రీధర్ తెలిపారు. శృంగారపురంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గంలోని నాయకులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. శ్రీధర్ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు, కార్మిక, కర్షకులకు అండగా అనేక పోరాటాలు చేసి ఎన్నో విజయాలు సాధించిందని తెలిపారు. స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న పార్టీ సీపీఐ అన్నారు. దేశ స్వాతంత్రం కోసం అనేక పోరాటాలు చేసి ఎంతోమంది కమ్యూనిస్టు నాయకులు జైలుకెళ్లి జైలు జీవితం గడిపారని తెలిపారు. ప్రస్తుతం ఇప్పుడు అధికారం అనుభవిస్తున్న పార్టీలు మత విద్వేషాలను రెచ్చగొడుతూ, మతాల మధ్య చిచ్చుల పెడుతోందని విమర్శించారు. పార్లమెంట్ సాక్షిగా అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ప్రధాన మోడీ వెనకేసుకోస్తున్నారని తెలిపారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం మీద పార్లమెంట్ సాక్షిగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి అమిత్ షాకి గుర్తులేదా ? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రా రోమ్ ఫిరంగిపురం

ఏటా వైభవంగా క్రిస్మస్ వేడుకలు



బాల ఏసు దేవాలయం

ఫిరంగిపురం: ఆంధ్రా రోమ్‌గా బాల ఏసు కెథడ్రల్ దేవాలయం ప్రసిద్ధి చెందింది. రాష్ట్రంలోని అత్యంత ఎత్తు అయిన మొదటి చర్చిగా పేరొందింది. ఇక్కడ ఏటా ఘనంగా మూడు రోజులపాటు జరిగే క్రిస్మస్ ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. ఇదే తరహాలో ఈ నెల 23, 24, 25వ తేదీల్లో క్రీస్తు జయంతి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ విచారణ గురువులు మాలపాటి ఫాతిమా మర్రెడ్డి తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచే నవదిన ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. 23న ఫాదర్ విలియం ప్రత్యేక దివ్యపూజాబలి, 24న ఫాతిమా మర్రెడ్డి దివ్యపూజాబలి నిర్వహిస్తారు. 24న రాత్రి 11 గంటలకు క్రీస్తు జయంతి మహోత్సవాలు ఉంటాయి. గుంటూరు మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య హాజరవుతారు. 25న విచారణ క్రైస్తవుల ఆత్మశరీర మేలు కోసం దివ్యపూజాబలి నిర్వహిస్తారు. ప్రధాన యాజకుడిగా తుమ్మా డోమనిక్ వ్యవహరిస్తారు. సాయంత్రం నిర్వహించే దివ్యపూజాబలిలో ప్రధాన యాజకుడిగా ఫాదర్ వి.రవీంద్ర పాల్గొంటారు. కార్యక్రమాలలో సహాయ విచారణ గురువులు వి. ప్రవీణ్‌కుమార్, బి.రవీంద్రలు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. దాదాపు 150 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ రవీంద్ర బాబు తెలిపారు. ట్రాఫిక్ చిక్కులు తలెత్తకుండా చూస్తామన్నారు.

బైకును ఢీకొన్న కారు : భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు



ధ్వంసమైన ద్విచక్ర వాహనం



ఘటనా స్థలిలో ఆంజనేయులు మృతదేహం

కొల్లిపర: కృష్ణా నది కరకట్టపై రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, ఆయన భార్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా కొల్లూరు గ్రామానికి చెందిన మట్టా ఆంజనేయులు(60) బైకుపై భార్యతో కలిసి విజయవాడ నుంచి కృష్ణా నది కరకట్టపై కొల్లూరు వస్తున్నాడు. కొల్లిపర మండలంలోని పిడపర్రు లాకుల వద్ద ఎదురుగా వేగంగా వచ్చిన ఓ కారు వారిని ఢీకొంది. కరకట్ట దిగువ ఉన్న పంట పొలంలో పడి ఆంజనేయులు మృతి చెందాడు. భార్యకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాదంపై బాధిత కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు.

అత్తామామలపై అల్లుడు దాడి





చికిత్స పొందుతున్న శివయ్య, రమణ

వినుకొండ(నూజెండ్ల): భార్యను కాపురానికి పంపలేదని అత్తామామలపై అల్లుడు కత్తితో దాడి చేసిన ఘటన వినుకొండ రూరల్ మండలం తిమ్మాయపాలెంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన బండారు శివయ్య, రమణల కుమార్తె అయిన లక్ష్మిని ఈపూరు మండలం ఇనిమెళ్ల గ్రామానికి చెందిన రాములు అనే వ్యక్తికి ఇచ్చి 12 ఏళ్ల క్రితం పెళ్లి చేశారు. వీరికి ముగ్గురు సంతానం. నిత్యం మద్యం తాగి భార్యను హింసిస్తుండటంతో ఏడాది క్రితం లక్ష్మి తిమ్మాయపాలెం గ్రామంలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చి ఉంటోంది. ఈ క్రమంలో అత్తామామలపై కక్ష పెంచుకున్న అల్లుడు రాములు మద్యం తాగి భార్య తన వద్దకు రాకపోవడానికి మీరే కారణమంటూ కత్తితో వారిపై దాడి చేశాడు. ఈ దాడిలో శివయ్యకు తీవ్రగాయాలు కాగా అత్త రమణకు చేయి విరిగింది. క్షతగాత్రులను వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటలతో ఉద్యోగుల పనితీరు మెరుగు



విజేతలతో ఈపీఎఫ్‌వో అధికారులు తదితరులు

గుంటూరు రూరల్: ఆటలతో ప్రభుత్వ ఉద్యోగుల పనితీరు మెరుగు పడుతుందని విజ్ఞాన్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ వై. వెంకటేశ్వరరావు అన్నారు. రెండు రోజులుగా పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ కళాశాలలో జరుగుతున్న ఈపీఎఫ్‌వో సౌత్‌జోన్ కబడ్డీ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ఈ వేడుకల్లో అతిథిగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి పోటీలు తరచూ నిర్వహించడం వల్ల వారిలో ఉత్సాహం పెరుగుతుందని చెప్పారు. అధ్యక్షత వహించిన గుంటూరు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ 2 ఇంద్రనీల్ ఘోష్ మాట్లాడుతూ... క్రీడలు ఉద్యోగుల శారీరక దారుఢ్యం, మానసిక వికాసానికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. సహాయక కమిషనరు మాధవశంకర్ మాట్లాడుతూ.. ఉద్యోగులు ఐక్యంగా పనిచేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. పోటీల్లో పాల్గొన్న 4 రాష్ట్రాల క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఉద్యోగులు ఎం. రామశేషు, రాకేష్‌లు పలు గీతాలు ఆలపించారు. కర్ణాటక జట్టుకు విన్నర్, తమిళనాడు జట్టుకు రన్నర్ ట్రోఫీని బహూకరించారు. క్రీడాకారులను మెమెంటో, సర్టిఫికెట్‌లతో సత్కరించారు. ఈపీఎఫ్ఓ సెంట్రల్ స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు మెంబర్ రవికుమార్ మాట్లాడుతూ క్రీడల నిర్వహణ తీరు బాగుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఇలియాస్‌ఖాన్, రిక్రియేషన్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ బాబు, కె. సుధాకరరావు, గంగాకృష్ణకాంత్, కె. సాయిధర్, ఎ. ప్రభాకర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

12న కృష్ణానదిలో ఈత పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తాడేపల్లి రూరల్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 12వ తేదీన కృష్ణానదిలో ఈత పోటీలు మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం అమరావతి కరకట్ట వెంబడి అసోసియేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కార్యదర్శి మండపాటి లక్ష్మీ నరసరాజు మాట్లాడుతూ.. విజయవాడ దుర్గా ఘాట్ నుంచి ప్రకాశం బ్యారేజ్ వద్ద లోటస్ ఫుడ్ సిటీ వరకు రివర్ క్రాస్ స్విమ్మింగ్ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. వయస్సు పరంగా 11 -18, 19 – 30, 31 – 40, 51 – 60 ఏళ్ల వారికి విభాగాలవారీగా పోటీలు ఉంటాయని తెలిపారు. ప్రతి కేటగిరీలో మూడు బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. జనవరి 10వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. అనంతరం పోటీలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వెలగపూడి వెంకటేశ్వరరావు, కన్వీనర్ దాసరి యుగేంధర్, కమిటీ మెంబర్లు కర్రి సాంబయ్య, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో బిషప్ సత్యకిరణ్‌కు చోటు



సత్తెనపల్లి: సత్తెనపల్లికి చెందిన బిషప్ ముక్తిపూడి సత్యకిరణ్‌కు తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు లభించింది. విజయవాడలోని ఠాగూర్ గ్రంథాలయంలో తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం వైభవంగా తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంస్థ నేషనల్ చైర్మన్ యు.వి.రత్నం ఆధ్వర్యంలో వివిధ ప్రముఖులకు, సాహిత్య సేవకులకు అవార్డుల ప్రదానం, సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. బిషప్ ముక్తిపూడి సత్య కిరణ్ సాహిత్యంలో కనబరిచిన ప్రతిభకు తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం కల్పించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సంస్థ బాధ్యులు, కళాకారులు, అభిమానులు డాక్టర్ పెద్దిటి జోసెఫ్, నన్నెపాగ ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.